మాట్లాడుతున్న జెసి రామసుందర్‌రెడ్డి

అనీమియా నివారణకు చర్యలు

- జెసి రామసుందర్‌రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అనీమియా నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని జెసి రామ సుందర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధికారులు, ఉద్యోగులకు అనీమియా పరీక్షలతో పాటు బీపీ, షుగర్ పరీక్షలను నిర్వహించారు. ఉద్యోగులతో పాటు జెసి, జిల్లా అధికారులు కూడా పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడారు. ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. ప్రత్యేకంగా గర్భిణులు, 10 నుంచి 19 ఏళ్ల బాలికలకు అనీమియా పరీక్షలను నిర్వహించి, ఐరన్, ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్స్ అందిస్తున్నట్లు చెప్పారు. ఫ్యామిలీ ఫిజిషియన్ విధానం, విలేజ్ హెల్త్ క్లినిక్స్ ద్వారా జిల్లాలోని 25 మండలాల్లో పిల్లల నుంచి వృద్ధుల వరకు అన్ని రకాల వైద్య పరీక్షలు, మందులు కూడా ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడీల ద్వారా పిల్లలు, గర్భిణులకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కింద పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. సామాన్య ప్రజలతో పాటు ఉద్యోగులకు కూడా అనీమియా పరీక్షలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ఈ ఆదేశాల మేరకు మొదట కలెక్టరేట్‌లో అనీమియాతో పాటు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం డిఆర్‌ఒ నాగేశ్వర రావు మాట్లాడారు. పని ఒత్తిడితో పరీక్షలు చేయించుకోలేని ఉద్యోగులకు ఇక్కడ పరీక్షలు నిర్వహించడం ఉపయోగకరంగా ఉందని పేర్కొన్నారు. వైద్య శిబిరంలో 530 ఉద్యోగులు పరీక్షలు చేయించుకున్నారని జిల్లా టిబి నియంత్రణ అధికారి డాక్టర్ భాస్కర్ తెలిపారు. సిపిఒ అప్పలకొండ, సమగ్ర శిక్ష పిఒ వేణుగోపాల్, డిపిఎంఒ డాక్టర్ ఉమా పాల్గొన్నారు.

ఓటరు దరఖాస్తులను పక్కాగా పరిశీలించండి

ఎమ్మెల్సీ ఎన్నికల కోసం వచ్చిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఓటరు దరఖాస్తులను పక్కాగా పరిశీలించాలని జెసి రామసుందర్ రెడ్డి ఆర్‌డిఒలు, తహశీల్దార్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వినియోగించుకునేందుకు ఉపాధ్యాయులు ఆరేళ్ల కాలంలో మూడేళ్ల పాటు ఉపాధ్యాయులుగా సెకండరీ గ్రేడ్ పాఠశాలల్లో పని చేసి ఉండాలని తెలిపారు. ఎలిమెంటరీ, పార్ట్ టైమ్ ఉపాధ్యాయులు అర్హులు కాదన్నారు. ప్రయివేట్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు సంబంధించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంతకంతో పాటు డిఇఒ కౌంటర్ సైన్ చేశారో లేదో పరిశీలించాలని తెలిపారు. పట్టభద్రుల ఓటర్లకు సంబంధించి 2019లోపు పట్టభద్రులై ఉండాలని చెప్పారు. డిగ్రీ, డిప్లొమా లేక సంబంధిత యూనివర్సిటీ ధ్రువపత్రాన్ని పరిశీలించాలని తెలిపారు. డిఆర్‌ఒ నాగేశ్వర రావు, కర్నూలు ఆర్‌డిఒ హరిప్రసాద్, పత్తికొండ ఆర్‌డిఒ మోహన్ దాస్, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ మురళీ పాల్గొన్నారు.

పరీక్షలు చేయించుకుంటున్న జెసి

ఉర్దూ వర్సిటీపై చిన్న చూపు

-భూ కేటాయింపులకు డబ్బులు చెల్లించాల్సిందే - లేకపోతే భూములు తీసుకుంటామని కలెక్టర్ ఆదేశాలు
- భవనాల అద్దెకూ నిధులు కరువు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఉర్దూ యూనివర్సిటీపై రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. ఈ వర్సిటీకి నిధుల కేటాయింపు కూడా చేయడం లేదు. గత ప్రభుత్వం చేసిన భూ కేటాయింపులకు డబ్బులు చెల్లిస్తేనే భూములు ఇస్తామని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యవహార శైలి పట్ల ముస్లిం, మైనారిటీ ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి.

రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రంలో అత్యధికంగా ముస్లిం జనాభా కలిగిన ప్రాంతాల్లో ఉమ్మడి కర్నూలు జిల్లా ఉండడంతో ఈ వర్సిటీని 2016లో గత ప్రభుత్వ హయాంలో తాత్కాలికంగా తరగతులను కర్నూలు ఉస్మానియా కళాశాలలో ప్రారంభించారు. అనంతరం కర్నూలు నగర శివారులోని గుత్తి రోడ్డు సమీపంలో ఓ అద్దె భవనంలోకి మార్చారు. ఈ వర్సిటీకి ఓర్వకల్లు శివారులో 147 ఎకరాలను గత ప్రభుత్వం కేటాయించింది. యూనివర్సిటీ భవన నిర్మాణాలకు అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారు. ఈ వర్సిటీ భవన నిర్మాణ పనులను కూడా చేపట్టారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యూనివర్సిటీ భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం వర్సిటీ పరిధిలో 250 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. వర్సిటీకి మొత్తం 35 బోధన అధ్యాపకుల పోస్టులు మంజూరు అయ్యాయి. ఇప్పటి వరకు ఒక్క పోస్టును కూడా భర్తీ చేయలేదు. కేవలం 15 మంది అధ్యాపకులు కాంట్రాక్టు పద్ధతిన పని చేస్తున్నారు. యూనివర్సిటీకి ఓర్వకల్లు పరిసర ప్రాంతంలో కేటాయించిన భూములకు ఎకరాకు రూ.5 లక్షల చొప్పున ఇవ్వాలని ఇటీవల కలెక్టర్ వైస్ ఛాన్సిలర్‌కు లేఖ రాశారు. మొత్తం ఈ భూములకు రూ.7.20 కోట్లు చెల్లిస్తేనే ఈ భూములను వర్సిటీకి అప్పగిస్తామని, లేకపోతే వెనక్కి తీసుకుంటామని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. వర్సిటీ ఉన్నతాధికారులు కూడా ఈ విషయాన్ని ఉన్నత విద్యా మండలి దృష్టికి తీసుకెళ్లారు. తమకు కేటాయించిన భూములను వర్సిటీకి ఇవ్వాలంటే ఈ నిధులను విడుదల చేయాలని కోరారు. ప్రస్తుతం తరగతులు నిర్వహిస్తున్న అద్దె భవనాలకు ఏడాదికి రూ.67 లక్షల చొప్పున అద్దె చెల్లించాల్సి ఉంటుంది. రెండు సంవత్సరాలుగా భవనాలకు అద్దె చెల్లించకపోవడంతో ఇటీవల భవన యజమాని వర్సిటీ ఉన్నతాధికారులను కలిసి అద్దె చెల్లించాలని కోరారు. ఒకవేళ చెల్లించకపోతే భవనాలను ఖాళీ చేసి వెళ్లాలని వర్సిటీ అధికారులతో పేర్కొన్నట్లు తెలిసింది.

మధ్యలో ఆగిపోయిన నిర్మాణం

ఉన్నతాధికారులకు నివేదించాం

- బోయినేని శ్రీనివాసులు, రిజిస్ట్రార్

యూనివర్సిటీ భూములకు సంబంధించి నిధులను కేటాయించాలని ఉన్నతాధికారులకు నివేదించాం. అలాగే వర్సిటీ అద్దె భవనాలకు కూడా అద్దె చెల్లించాలని కోరాం. వీటితోపాటు వర్సిటీకి అవసరమయ్యే గ్రాంట్లు కూడా విడుదల చేయాలని విన్నవించాం.

మైనారిటీల పట్ల అలసత్వం తగదు

- ఇక్బాల్, ఆవాజ్ నగర కార్యదర్శి

ముస్లిం, మైనార్టీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం వహిస్తోంది. మైనారిటీలకు సంబంధించిన ఉర్దూ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేయాల్సింది పోయి దానిని నాశనం చేయడం సరైంది కాదు. వర్సిటీకి కేటాయించిన భూములకు ఇప్పుడు డబ్బులు చెల్లిస్తే భూ కేటాయింపులు చేస్తామని చెప్పడం బాధాకరం. మైనార్టీ ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని వెంటనే ఈ వర్సిటీ అభివృద్ధికి నిధులను కేటాయించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి.

క్రమశిక్షణ, సాధనతో క్రీడల్లో రాణింపు

- యువ పారిశ్రామిక వేత్త భరత్
- అట్టహాసంగా రాష్ట్రస్థాయి టెన్నిస్ వాలీబాల్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి - కర్నూలు స్పోర్ట్స్

ఆస్ట్రేలియా ప్రముఖ క్రికెటర్ జాంటీ రోడ్స్ చెప్పినట్లుగా యువత క్రమశిక్షణ, నిత్య సాధనతో రాణించినప్పుడే క్రీడల్లో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని యువ పారిశ్రామికవేత్త టిజి.భరత్ తెలిపారు. శనివారం కర్నూలు నగర శివారులోని ఆదర్శ విద్యాసంస్థల క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి టెన్నిస్ వాలీబాల్ ఛాంపియన్‌షిప్‌ను ప్రారంభించారు. భరత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గౌరవ అతిథులుగా టిడిపి జిల్లా అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా టెన్నిస్ వాలీబాల్ అధ్యక్ష, కార్యదర్శులు సత్రం రామకృష్ణుడు, ఈశ్వర్ నాయుడు, రాష్ట్ర టెన్నిస్ వాలీబాల్ సంఘం కార్యదర్శి సాంబశివరావు, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.వరప్రసాద్, ట్రెజరర్ గురుమూర్తి, పోతురాజు విజయ్ కుమార్, జిల్లా త్రోబాల్ కార్యదర్శి కిరణ్ కుమార్ హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం 10 జిల్లాల నుంచి పాల్గొన్న క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడారు. క్రీడల్లో రాణించేందుకు యువత పట్టుదల, నిత్యసాధనతోపాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలని తెలిపారు. అనంతరం ఆదర్శ విద్యా సంస్థల అధినేత తిమ్మయ్య మాట్లాడారు. క్రీడాకారులకు తమ విద్యాసంస్థల తరపున ఎల్లప్పుడూ సహకారం అందిస్తామని తెలిపారు. కర్నూలులో క్రీడాభివృద్ధికి టిజి కుటుంబం చేస్తున్న కృషి అభినందనీయమని కర్నూలు టెన్నిస్ వాలీబాల్ సంఘం అధ్యక్షులు సత్రం రామకృష్ణుడు తెలిపారు. రెండు రోజులపాటు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి విజయవంతం చేయాలని జిల్లా టెన్నిస్ వాలీబాల్ సంఘం కార్యదర్శి ఈశ్వర్ నాయుడు, నవీన్ కోరారు. మిలిటరీ కాలనీ జిల్లా పరిషత్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వ్యాయామ ఉపాధ్యాయులు ప్రసాద్ నాయుడు, జోసెఫ్, నాగరాజు, అనిల్, భీమా నాయుడు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముఖ్యఅతిథులు

నష్టాల 'మాండూస్'

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఏటా నవంబరు ఆఖరు, డిసెంబరులో పడుతున్న వర్షాలతో అన్నదాతలు నష్టపోతూనే ఉన్నారు. జిల్లాలోని రైతులను ఈ ఏడాది మాండూస్ తుపాను వణికించింది. చిరు జల్లుల నుంచి మోస్తరు వర్షంతోపాటు ఈదురు గాలులు వీచడంతో పంటలు దెబ్బతిన్నాయి. పలు ప్రాంతాల్లో మిరప రైతులు కాయలు కోసి కల్లాల్లో ఆరబెట్టారు. ఈ సమయంలో వర్షం పడడంతో తడిసి ముద్దయింది. కర్నూలు జిల్లాలో 6,74,864 ఎకరాల్లో పత్తి సాగయింది. ఇప్పటికే ఒకటి, రెండుసార్లు పత్తి తీయడం పూర్తయింది. మూడో విడత పత్తి తీసేందుకు సిద్ధమవుతున్న సమయంలో వర్షం పడడంతో తడిసి పనికి రాకుండా పోతోంది. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో మిరప పంట 70 నుంచి 90 రోజుల మధ్యలో ఉంది. ఈ దశలో వర్షం కొనసాగితే భూమిలో తేమ శాతం పెరిగి మొక్కకు ఆహారం తీసుకునే శక్తి తగ్గిపోతుంది. ఫలితంగా దిగుబడులపై ప్రభావం పడుతుంది. కాయలు తెల్లగా మారిపోయే ప్రమాదముంది. ఖరీఫ్ సీజన్లో రైతులు మొక్కజొన్న సాగు చేయగా ప్రస్తుతం నూర్పిడి చేసి కల్లాల్లో ఆరబెట్టారు. ఈ దశలో వర్షం రావడంతో తడిసిపోయాయి. నాణ్యత దెబ్బతినడంతోపాటు వాటిని నిల చేసేందుకు రైతులు ఇబ్బందులు పడుతు న్నారు. రబీ సీజన్లో నవంబరు రెండో వారం నుంచి ఉమ్మడి జిల్లాలో మొక్క జొన్న సాగు మొదలైంది. కొందరు తొలివారంలో విత్తనాలు నాటారు. ఈ పరిస్థితుల్లో పొలాల్లో నీరు నిలిస్తే మొక్కలు చనిపోతాయని పలువురు ఆవేదన చెందుతున్నారు. చేతికొచ్చిన వరి పంట కోత కోసుకోలేక, కోసిన వరి ధాన్యం కల్లాల్లో ఉండి తడవకుండా పట్టాలు కప్పుకుంటూ రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

'హంద్రీ' రైతుల ఆందోళన : హంద్రీనీవా కింద రైతులు వేసిన పంటలకు మార్చి నెల చివరి వరకు ఇస్తామని తొలుత చెప్పిన అధికారులు ప్రస్తుతం జనవరి వరకే ఇస్తామని చెబుతున్నారు. హంద్రీనీవా కింద ఉమ్మడి జిల్లాలో 40 వేల ఎకరాల్లో రబీలో పంట వేశారు ఇప్పుడు హంద్రీనీవా అధికారులు మార్చి చివరి వరకు సాగునీరు అందించలేమని చెప్పడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఈ సంవత్సరం ఖరీఫ్‌లో అధిక వర్షాలు రావడం, తెగుళ్లు రావడం, నకిలీ విత్తనాల వల్ల వేసిన పంటలు చేతికి రాక అప్పులతో విలవిలలాడుతున్న రైతులకు రబీలో అయినా పంటలు సాగు చేసుకునేందుకు అధికారులు అవకాశం లేకుండా చేశారు.

అవీ..ఇవీ..అన్నీ.. : మార్చి చివరి వరకూ హంద్రీకి నీటిని విడుదల చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, కార్యదర్శివర్గసభ్యులు కెవి నారాయణ హంద్రీనీవా ఎస్ఇకి వినతిపత్రం సమర్పించారు. సిపిఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో యుటిఎఫ్ ఆధ్వర్యంలో 5కె రన్ నిర్వహించారు. జిల్లా స్థాయి చెకుముకి సంబరాలు ముగిసాయి. నిరుద్యోగుల అక్రమ అరెస్టులను ఖండిస్తూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కర్నూలు సుందరయ్య కూడలిలో నిరసన చేపట్టారు. నకిలీ విత్తనాలు, అకాల వర్షాలు, మాండూస్ తుపాను వల్ల నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో కర్నూలు కలెక్టరేట్, ఆదోని, పత్తికొండ ఆర్‌డిఒ కార్యాలయాలు, ఎమ్మిగనూరు వ్యవసాయ శాఖ ఎడి కార్యాలయం ముందు ధర్నాలు నిర్వహించారు. ఓర్వకల్లు మండలం నన్నూరులో తోడికోడళ్లు హత్యకు గురయ్యారు. చివరకు మామ, భర్తలే వారిని కడతేర్చినట్లు పోలీసులు తేల్చారు. నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు.

రైతు రక్షణ కాలినడక యాత్రలో పాల్గొన్న నాయకులు

రైతులను ఆదుకోవాలి

- సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు

ప్రజాశక్తి - వెల్దుర్తి

అధిక వర్షాలు, నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 20న కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ చేపట్టిన రైతు రక్షణ కాలినడకన యాత్ర శనివారం వెల్దుర్తిలో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉల్లి, మిర్చి, టమోటా, వేరుశనగ, వరి, కంది పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కటారికొండ గ్రామ సర్పంచ్ లెనిన్ బాబు, జిల్లా సహాయ కార్యదర్శి ఎన్.రసూల్, బొంతురాళ్ళ సర్పంచ్ రవి మోహన్, సిపిఐ మండల కార్యదర్శి కృష్ణ, మండల సహాయ కార్యదర్శి డి రాజు, పట్టణ సహాయ కార్యదర్శి చిన్నమధు, రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు మాధవ కృష్ణ, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి - పత్తికొండ

విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సేవలు మరువలేనివని మైత్రి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు రామ్మోహన్ కొనియాడారు. శనివారం పత్తికొండ పట్టణంలోని షాదిఖానా ఫంక్షన్ హాల్‌లో ప్రభుత్వ పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా మైత్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగులు ఎన్జీవో సంఘం ప్రెసిడెంట్ టిఎండి హుస్సేన్, అల్లిపీర కృష్ణయ్య, ప్రతాప్ నాయుడు, జయరాముడుతో పాటు 15 మందిని పూలమాల, శాలువాలతో సత్కరించారు.

మాట్లాడుతున్న రామ్మోహన్

పోలీసు జాగీలం యామి మృతి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

జిల్లా పోలీసుశాఖలో 2011 నుండి సేవలందించిన పోలీసు జాగీలం యామి శనివారం తెల్లవారుజామున కర్నూలు డాగ్ స్క్వాడ్ కార్యాలయంలో మృతి చెందింది. యామి ల్యాబ్ బ్రీడ్ జాతికి చెందిన ఆడ జాగీలం. యామి మృతదేహానికి దిన్నెదేవరపాడు దగ్గర గల జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో ఎఆర్ అదనపు ఎస్పీ జి.నాగబాబు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మృతి చెందిన యామి పోలీసుశాఖ డాగ్ స్క్వాడ్‌లో ఉన్నప్పటి నుండి వివిధ విఐపిల బందోబస్తులు, స్నిఫర్ ఎక్స్ ప్లోజివ్ మందుపాతరలను గుర్తించడంలో, 4 రిఫ్రెషర్ కోర్సులు, 2 స్టేట్ మీట్స్, 5 ప్రధాన మంత్రి బందోబస్తులు, సిఎం బందోబస్తులో సేవలందించింది. ఎలక్షన్ విధులు, శివరాత్రి, విఐపి విజిట్స్, తిరుమల బ్రహ్మోత్సవాలలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించిందని పోలీసు అధికారులు కొనియాడారు. యామి కర్నూలు జిల్లాకు వచ్చినప్పటి నుండి డాగ్ హ్యాండ్లర్‌గా ఉన్న ఎఆర్ కానిస్టేబుల్ సిహెచ్. మనోహర్ కన్నీటి పర్యంతమయ్యారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్పీ ఇలియాజ్ భాషా, ఆర్ఐలు రవి కుమార్, సురేంద్రారెడ్డి పాల్గొన్నారు.

పోలీస్ జాగీలం యామికి నివాళ్లులర్పిస్తున్న ఎఆర్ అదనపు ఎస్పి జి.నాగబాబు

కవి చౌశా కవితా సంపుటి 'దగ్ధభూమి' ఆవిష్కరణ

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

సామ్రాజ్యవాద యుద్ధాల వల్ల నష్టపోయేది కార్మిక వర్గమేనని ప్రముఖ కవి జంధ్యాల రఘుబాబు తెలిపారు. శనివారం స్థానిక లలిత కళా సమితిలో కవి చౌశా రచించిన 'దగ్ధ భూమి' కవితా సంపుటి ఆవిష్కరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య పుస్తకాన్ని ఆవిష్కరించారు. రచయిత, ఉపాధ్యాయులు మారుతి పౌరోహిత్యం అధ్యక్షత వహించారు. ప్రముఖ కవి కెంగార మోహన్ పుస్తకాన్ని సమీక్షించారు. అంతర్జాతీయ విషయాలపై ఎంతో అవగాహన ఉన్న చౌశా... యుద్ధాలు వద్దని, ప్రపంచ శాంతి కావాలంటే... సామ్యవాదం ఒక్కటే మార్గమని ఈ పుస్తకం ద్వారా ఆకాంక్షించారని గుర్తు చేశారు. కార్ల్ మార్క్స్ చెప్పినట్లు ప్రపంచ కార్మికులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న నాగేశ్వరాచారి మాట్లాడుతూ ఈ పుస్తకం ద్వారా సామ్రాజ్యవాదుల దురాగతాలను ఎండగట్టాలని తెలిపారు. చరిత్ర మీద ఎంతో పట్టున్న కవి చౌశాకు మంచి భవిష్యత్తు ఉందని చారిత్రక నవలా రచయిత ఎస్డీవీ అజీజ్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, సహా కవులు, రచయితలు పాల్గొన్నారు.

దగ్ధభూమి కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న జంధ్యాల రఘుబాబు, జి.పుల్లయ్య తదితరులు

సచివాలయం పనులు ముమ్మరం

ప్రజాశక్తి - సి.బెళగల్

మండలంలోని ఈర్లదిన్నెలో సచివాలయం పనులను ఈఓఆర్‌డీ సందీప్ ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ భవనం త్వరలో ప్రారంభం చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే మండలంలో నిర్మాణంలోనున్న ప్రభుత్వ భవనాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు.

పనులను పరిశీలిస్తున్న ఇఒఆర్‌డి

రాష్ట్రంలో రాక్షస పాలన

- ప్రతిపక్ష నేతలపై అధికారపక్షం దాడులు : టిడిపి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం రాక్షస పాలన కొనసాగిస్తుందని, ప్రతిపక్షాలపై అధికార పక్ష నేతలు దాడులు అధికమయ్యాయని టిడిపి పాణ్యం ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి ఆరోపించారు. శనివారం కల్లూరు మండలం చెట్లమల్లాపురం గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. వైసిపి ప్రభుత్వంలో ఎటువంటి సమస్యలను ఎదుర్కుంటున్నారో ప్రజలను ఆమె అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కల్లూరు మండల మాజీ ఎంపీపీ వాకిటి మాధవి, నాయకులు మాదేష్, గ్రామ నాయకులు తిమ్మారెడ్డి, దామోదర రెడ్డి, మురళీధర్ రెడ్డి, సోమేశ్వరయ్యా, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు గంగాధర్ గౌడ్, బొల్లారం పీవీ రమణ రెడ్డి, ఉలిందకొండ కలాం బాషా, లక్ష్మీపురం శేఖర్ కళ్యాణ్, కల్లూరు అర్బన్ నాయకులు ధనుంజయ, రవి ప్రకాష్ రెడ్డి, నీలకంఠం, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

20న 155 వాహనాలకు వేలం : ఎస్పి

కర్నూలు క్రైమ్ : క్రైమ్, ఎక్సైజ్ కేసుల్లో, అక్రమంగా మద్యం, సారా, గంజాయి తరలిస్తూ పట్టుబడిన 155 వాహనాలకు ఈ నెల 20న వేలం వేస్తున్నామని కర్నూలు జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ దిన్నెదేవరపాడు గ్రామం జగన్నాథ గట్టు దగ్గర ఉన్న కర్నూలు జిల్లా పోలీసు శిక్షణా కేంద్రం లో 109 టూ వీలర్స్, 30 త్రీ వీలర్ వాహనాలను, కర్నూలు తాలుకా పోలీసుస్టేషన్‌లో 16 ఫోర్ వీలర్, 26 త్రీ వీలర్ వాహనాలను వేలంలో ఉంచనున్నామన్నారు. ఉదయం 10 గంటలకు ఆయా పోలీసు అధికారుల సమక్షంలో వాహనాల వేలం ప్రారంభమవుతుందన్నారు. వాహనాల వేలంలో పాల్గొనదలచిన వారు మొదటగా వేలం పాట ప్రారంభకాక ముందే రూ. 3 వేలు ధరావత్తు చెల్లించి టోకెన్ తీసుకుని పాల్గొనాలన్నారు. ఆధార్ కార్డు ఖచ్చితంగా తీసుకురావాలన్నారు. వేలం పాట పాడి దక్కించుకున్న ఆ వాహనంకు సంబంధించిన జిఎస్టీ 18 శాతంను, వాహనం ధర మొత్తం అదే రోజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

19న స్పందన కార్యక్రమం

కర్నూలు కలెక్టరేట్ : ఈ నెల 19వ తేదీ సోమవారం కర్నూలు కలెక్టర్ కార్యాలయంలోని సునయన ఆడిటోరియంలో స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా స్పందన కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

నేడు క్యాండిల్ లైట్ సర్వీస్

కర్నూలు స్పోర్ట్స్ : కర్నూలు నగరంలోని రెవెన్యూ కాలనీలో ఉన్న ఆరోహణ క్రైస్ట్ చర్చ్‌లో నేడు క్యాండిల్ లైట్ సర్వీస్‌ను నిర్వహిస్తున్నట్లు నంద్యాల డయోసిస్ వైస్ ప్రెసిడెంట్ రెవ పి.ఎ.వరప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక ఆరోహణ క్రైస్ట్ చర్చ్‌లో విలేకరుల సమావేశంలో రెవ.వరప్రసాద్, రెవ.రవికుమార్ మాట్లాడారు. క్రీస్తు లోకానికి వెలుగుగా వచ్చాడని నేడు క్యాండిల్ లైట్ సర్వీస్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కర్నూలు, పాణ్యం, నందికొట్కూరు, కోడుమూరు ఎమ్మెల్యేలు హాఫీజ్ ఖాన్, కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఆర్థర్, సుధాకర్‌లను ఆహ్వానిస్తున్నామన్నారు. డయోసిస్ బిషప్ ఎగోని పుష్ప లలిత పాల్గొంటారని తెలిపారు. ఈ నెల 25న క్రిస్టమస్ రోజున ఉదయం 5 గంటలకు ఆరాధన ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో చర్చ్ కార్యదర్శి యం.టి.ఆగస్టైన్, ట్రెజరర్, జి.దేవాకృప, సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రెవ. పి.ఎ.వరప్రసాద్

మాచర్లలో దాడి పిరికిపంద చర్య

- టిడిపి సీనియర్ నాయకులు ఉలిగయ్య

ప్రజాశక్తి - కౌతాళం

మాట్లాడుతున్న నాయకులు ఉలిగయ్య

పల్నాడు జిల్లా మాచర్లలో జరిగిన దాడి పిరికిపంద చర్య అని టిడిపి మంత్రాలయం సీనియర్ నాయకులు ఉలిగయ్య, టిడిపి రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి అడివప్ప గౌడ్ విమర్శించారు. శనివారం వారు వేర్వేరుగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'ఇదేం ఖర్మ.. మన రాష్ట్రానికి' నిర్వహిస్తున్న నాయకులపై దాడికి పాల్పడడం సిగ్గు చేటన్నారు. టిడిపికి పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక వైసిపి నాయకులు దాడికి పాల్పడ్డారని తెలిపారు. టిడిపికి ప్రజల మద్దతు ఉన్నంత వరకు ఎవరూ భయపడేది లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో ఓడిపోతామన్న భయం వైసిపిని వెంటాడుతోందని చెప్పారు. పోలీసులు వైసిపి నాయకులపై చర్యలు తీసుకోవాల్సింది పోయి, టిడిపి కార్యకర్తలను అరెస్టు చేయడం సరైంది కాదని తెలిపారు. మాచర్లలో వైసిపి నాయకుడు తురక కిషోర్ ఆగడాలు పెరిగిపోతున్నాయన్నారు. ఇలాంటి ఆగడాలు ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో వైసిపికి తగిన బుద్ధి చెబుతారని తెలిపారు. టిఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రోహిత్, టిడిపి నాయకులు గోవిందు, నాగరాజు, సురేష్ నాయుడు, యువసేన పాల్గొన్నారు.

ఉల్లి కషాయంతో 'నల్ల తామర' దూరం

- ప్రకృతి వ్యవసాయాధికారులు

ప్రజాశక్తి - చిప్పగిరి

ఉల్లి కషాయంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మిరప పంట వేసుకున్న రైతులందరూ నల్ల తామర తెగులుతో చాలా ఇబ్బంది పడుతున్నారని, ఉల్లి కషాయంతో ఈ తెగులును నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయాధికారులు తెలిపారు. శనివారం నగరడోనా గ్రామంలో ప్రకృతి వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో రంగస్వామికి చెందిన పొలంలో మిరప పంటకు తామర తెగులు నివారణకు గల మిశ్రమాన్ని వివరించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ అధికారులు ఎంటి నగేష్, ఎంసిఆర్‌పి రవికుమార్, ఐసిఆర్‌పి రంగయ్య మాట్లాడారు. నల్ల తామర తెగులు రాకుండా ఉల్లి కషాయంతో కూడిన మిశ్రమాన్ని పిచికారి చేయాలని సూచించారు. వేపాకు మూడు కిలోలు, ఉమ్మెత్త ఆకు మూడు కిలోలు, సీతాఫలం ఆకులు మూడు కిలోలు, ఉల్లి గడ్డలు ఐదు కిలోలు, ఆవు మూత్రం 10 లీటర్లతో ఉడకబెట్టిన మిశ్రమాన్ని మిరప పంటకు పిచికారి చేయాలని తెలిపారు. రైతులు ఈ మిశ్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, కావాల్సిన రైతులు ప్రకృతి వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కోరారు.

రాష్ట్రంలో అరాచక పాలన

- టిడిపి ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ

ప్రజాశక్తి- ఆలూరు

రాష్ట్రంలో జగన్ రెడ్డి అరాచక పాలన కొనసాగుతోందని, మాచర్లలో టిడిపి నాయకులపై వైసిపి గూండాలు దాడి చేయడం హేయమైన చర్య అని మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ విమర్శించారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మాచర్ల నియోజకవర్గంలో 'ఇదేం ఖర్మ... మన రాష్ట్రానికి'లో పాల్గొన్న టిడిపి నాయకులు, కార్యకర్తలు, కార్యాలయంపై దాడులు చేయడం అమానుషమని తెలిపారు. రాష్ట్రంలో టిడిపికి మంచి ఆదరణ లభిస్తోందని, వైసిపికి ఓటమి భయం పట్టుకుందని చెప్పారు. ఓర్వలేకనే టిడిపి కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ప్రజలకు శాపంగా మారాయని తెలిపారు. చంద్రబాబు నాయుడు ముందు చూపుతో, గొప్ప విజన్‌తో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తే జగన్ రెడ్డి అస్తవ్యస్త పాలనతో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని, మళ్లీ చంద్రబాబు నాయుడు పాలనను ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు.

19న వేదవతి ప్రాజెక్టు సాధన పాదయాత్ర : ఆలూరు నియోజకవర్గ రైతులు, ప్రజల చిరకాల స్వప్నం వేదవతి అని, ప్రాజెక్టు సాధన కోసం ఈనెల 19న హాలహర్వి నుంచి గూళ్యం వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు సుజాతమ్మ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో ఉన్న నీటి ప్రాజెక్టుల నిర్మాణాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రాయలసీమ ప్రాంత అభివృద్ధిని వైసిపి ప్రభుత్వం విస్మరించిందని తెలిపారు. వేదవతి ప్రాజెక్టుకు నిధులు కేటాయించక పోవడంతో పనులు నిలిచి పోయాయని చెప్పారు. వేదవతి ప్రాజెక్టును 8 టిఎంసిల సామర్థ్యంతో నిర్మించాలని డిమాండ్ చేశారు. వేదవతి ప్రాజెక్టు సాధన కోసం చేపట్టే పాదయాత్రకు కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి, టిడిపి మాజీ మంత్రులు కాల్వ శ్రీనివాసులు, పరిటాల సునీత, అమర్‌నాథ్‌రెడ్డి రెడ్డి, వైకుంఠం ప్రభాకర్ చౌదరి, ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ మద్దతుగా హాజరవుతారని తెలిపారు. రైతులు, ప్రజలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

- సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈశ్వరయ్య

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరులో పాదయాత్ర నిర్వహిస్తున్న నాయకులు

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం చెందిందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య విమర్శించారు. శనివారం సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన రైతు రక్షణ పాదయాత్ర శనివారం పట్టణంలోని సోమప్ప సర్కిల్ మీదుగా గాంధీ సర్కిల్, గోనెగండ్ల రోడ్డు కర్నూలుకు బయల్దేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ ఏడాది వర్షాలు అధికంగా కురవడంతో పంటలు దెబ్బతిన్నాయని, పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వామపక్ష నాయకులు పంపన్న గౌడ్, ప్రజానాట్య మండలి నాగరాజు, రంగన్న, తిమ్మగురుడు, విజయేంద్ర, రాముడు, శ్రీరాములు, భాస్కర్ యాదవ్, రాజీవ్, సత్యన్న, రాజు, గుడికల్ నరసన్న, చిన్నన్న, దస్తగిరి, నాగప్ప పాల్గొన్నారు.

గోనెగండ్ల : రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జగన్నాథం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరాములు విమర్శించారు. రైతు రక్షణ కాలినడక యాత్ర గోనెగండ్ల చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక వైఎస్ఆర్ సర్కిల్ వద్ద జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో ఇటీవల కురిసిన అధిక వర్షాలు, నకిలీ పత్తి విత్తనాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వారిని ఆదుకోవాలని కోరారు. నాయకులు రంగన్న, పంపన గౌడు, జిల్లా సమితి సభ్యులు మద్దిలేటి నాయుడు పాల్గొన్నారు.

గోనెగండ్లలో పాదయాత్రలో పాల్గొన్న టిడిపి నాయకులు

టిడిపి నాయకుల సంఘీభావం

సిపిఐ చేపట్టిన రైతు రక్షణ కాలినడక యాత్రలో టిడిపి మండల నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. గంజిహళ్లి రోడ్డు నుంచి వైఎస్ఆర్ సర్కిల్ వరకు పాదయాత్రలో పాల్గొని సంఘీభావం తెలిపారు. నజీర్ సాహెబ్, శ్రీధర్ నాయుడు, తిరుపతయ్య నాయుడు, రమేష్ నాయుడు, కులుమాల రాముడు, చిన్ననేలటూరు నాగన్న, అడ్వకేట్ చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, అచ్చుగట్ల ఫక్రుద్దీన్, యూనుస్, చెన్నల రాయుడు పాల్గొన్నారు. **దేవనకొండలో** సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో రైతు రక్షణ కాలినడక యాత్ర సిపిఐ మండల కార్యదర్శి నరసరావు అధ్యక్షతన సాగింది. సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వీర శేఖర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మద్దిలేటి శెట్టి, నబీ రసూల్ మాట్లాడారు. నకిలీ పత్తి విత్తనాలు అమ్మడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. టిడిపి, కాంగ్రెస్, లోక్‌సత్తా నాయకులు బడిగింజల రంగన్న, ఆకుల వీరేష్, మాల కన్న, గొర్రెల శ్రీనివాసులు, రాందాస్ గౌడ్ సంఘీభావం తెలిపారు. రైతు సంఘం జిల్లా నాయకులు జగదీష్, తిమ్మయ్య, రాజా సాబ్, నాగేంద్రప్ప, సిపిఐ, సిపిఎం నాయకులు నెట్టేకల్లు, వెంకటేష్, సూరి, అశోక్ పాల్గొన్నారు.

దేవనకొండలో మాట్లాడుతున్న సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

మానవతావాదులు ముందుకు రావాలి

- లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ డాక్టర్ గోపీనాథ్

ప్రజాశక్తి - ఆదోని

కనీస సౌకర్యాల్లేక ఇబ్బందులు పడుతున్న వారిని ఆదుకునేందుకు మానవతావాదులు ముందుకు రావాలని లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ డాక్టర్ గోపీనాథ్, ప్రసాద్ రావు కోరారు. శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపీనాథ్ మాట్లాడారు. గతంలో రైల్వే స్టేషన్, బస్టాండ్ వద్ద, రెండో విడత పేదల ఇళ్ల వద్దకు వెళ్లి ఇప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. మూడో విడత కూడా రోడ్ సైడ్ ఉన్న అభాగ్యులకు దుప్పట్లు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. చలి తీవ్రత ఎక్కువైనందున దుప్పట్లు లేని వారికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పంపిణీ చేసి ఆదుకున్నామన్నారు. అధ్యక్షులు ధర్మారెడ్డి, ఈసీ మెంబర్లు నీల మోహన్, గోవింద రాజామూర్తి, గోవిందరావు, వివేకానంద సంస్థ సభ్యులు గోపాల్ పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నీటిఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

- సర్వసభ్య సమావేశంలో ఎంపిపి హేమలత, వైసిపి కన్వీనర్ నారాయణ

ప్రజాశక్తి - చిప్పగిరి

వేసవి కాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎంపిపి జూటూరు హేమలత, వైసిపి కన్వీనర్ గుమ్మనూరు నారాయణ, వైసిపి యువ నాయకులు జూటూరు మారయ్య అధికారులకు సూచించారు. శనివారం మండల కార్యాలయంలో ఎంపిపి హేమలత అధ్యక్షతన ఇన్‌ఛార్జీ ఎంపిడిఒ సుధాకర్ రాజు ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాగానే మండల అధికారులు గత మూడు నెలల్లో జరిగిన అభివృద్ధి పనులను, ప్రగతి నివేదికలతో చదివి వినిపించారు. ఎఒ ఆనంద్ ప్రగతి నివేదిక వినిపించే సమయంలో దేగలహాల్ సర్పంచి నీలకంఠ కలుగజేసుకొని మిరప పంటకు అనేక తెగుళ్లు సోకుతున్నాయని, ఆర్‌బికెలో పని చేస్తున్న వారు రైతులకు అవగాహన కల్పించడంలో విఫలమవుతున్నారని, రైతులు రూ.వేలకు వేలు పెట్టుబడులు పెట్టి చాలా నష్టపోతున్నారని, రైతుల సమస్యలను ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సభా దృష్టికి తెచ్చారు. ఎఒ సమాధానం ఇస్తూ... రైతులకు తగిన సూచనలు ఇచ్చేలా అగ్రికల్చర్ అసిస్టెంట్‌కు సూచనలు ఇస్తామని చెప్పారు. అనంతరం ఎంపిపి హేమలత మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రభుత్వం జలజీవన్ మిషన్ ద్వారా మండలానికి రూ.3.70 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. నీటి సమస్య ఎక్కువగా ఉన్న గ్రామాలకు కొత్తగా తాగునీటి పైపులైన్ వేసుకోవడానికి వెసలుబాటు కల్పించినట్లు చెప్పారు. మండలంలోని కాజీపురం, చిప్పగిరి, బెల్డోన ఎస్ఎస్ ట్యాంకుల్లో 80 శాతం తాగునీరు నింపినట్లు తెలిపారు. అధికారులు ముందు జాగ్రత్తతో నీటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలని సూచించారు. వైస్ ఎంపిపి పద్మావతి, సర్పంచులు, ఎంపిటిసిలు, పిఆర్ జెఇ చోళ రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రామ్ నీలా, డిటి గుండాల నాయక్, ప్రభుత్వ డాక్టర్ జమీల్ అహ్మద్, ఎపిఎం నాగార్జున, ఎపిఒ మాధవ శంకర్, ట్రాన్స్‌కో ఎఇ ఉల్లిగన్న, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పద్మావతి పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి జూటూరు హేమలత

అరాచక పాలనకు రోజులు దగ్గర పడ్డాయి

- టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

అధికారం అడ్డుపెట్టుకొని టిడిపి నాయకులనే లక్ష్యంగా దాడులు చేస్తూ అరాచక పాలన చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని ఇంటికి సాగనంపే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని టిడిపి ఆదోని నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ తెలిపారు. శనివారం వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మాచర్లలో శాంతియుతంగా 'ఇదేం ఖర్మ.. మన రాష్ట్రానికి' నిర్వహిస్తున్న టిడిపి కార్యకర్తలపై వైసిపి వర్గీయులు రాళ్లు, కర్రలతో దాడి చేయడం దుర్మార్గమన్నారు. అధికార పార్టీ లోపాలను ఎత్తి చూపే బాధ్యత ప్రతిపక్ష పార్టీకి ఉందన్నది వైసిపి నాయకులు గ్రహించకపోవడం అవివేకమని మండిపడ్డారు. ఫ్యాక్షన్ గొడవలను సృష్టిస్తున్న స్థానిక ఎమ్మెల్యే పిన్నెల్లిపై పోలీసులు కేసు నమోదు చేయాలన్నారు. రాజ్యాంగ హక్కును హరిస్తూ ప్రతిపక్ష పార్టీ నాయకులపై దాడులు చేస్తూ భయానక వాతావరణం సృష్టిస్తున్నారని తెలిపారు. వైసిపి శ్రేణులు ఆటవికంగా దాడి చేస్తున్నా పోలీసులు పట్టించుకోకపోవడం సమంజసం కాదన్నారు. దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి శాంతిభద్రతలను పరిరక్షించాలని పోలీసులను కోరారు.

పట్టుబడిన వాహనాలకు 21న వేలంపాట

- డీఎస్పీ వినోద్‌కుమార్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని సబ్ డివిజన్ పరిధిలో అక్రమ మద్యం రవాణాలో పట్టుబడిన 112 వాహనాలకు ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు ఈనెల 21న వేలం పాట నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ వినోద్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన ఆదోని కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు ముందస్తుగా ప్రవేశ రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించే ఈ వేలం పాటలో 4 ఫోర్ వీలర్స్, 10 త్రీ వీలర్స్, 98 టూ వీలర్స్ వాహనాలు ఉంచుతున్నట్లు తెలిపారు. ఔత్సాహికులు ఆధార్ కార్డుతో వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

ఎంపికైన విద్యార్థి వంశీ వివేకానంద

సౌత్ జోన్ పోటీలకు 'సిద్ధార్థ' విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థి వంశీ వివేకానంద సౌత్ జోన్ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. రాయలసీమ యూనివర్సిటీ ప్రాబబుల్స్‌లో సిద్ధార్థ డిగ్రీ కళాశాల విద్యార్థి వంశీ వివేకానంద ఇటీవల ఎంపికయ్యారు. ఈ పోటీలు కేరళలోని కొట్టాయం యూనివర్సిటీలో 23 నుంచి 31 వరకు జరగనున్నాయి. సౌత్ జోన్ పోటీలకు ఎంపికైన వంశీ వివేకానందకు కళాశాల యాజమాన్యం బి.వేణుగోపాలాచారి, ప్రిన్సిపల్ కమల సుజాత శనివారం అభినందించారు.

శ్రీమఠానికి రూ.2 లక్షల విరాళం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠానికి ఓ భక్తుడు రూ.2 లక్షల విరాళం అందజేసినట్లు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూర్‌కు చెందిన భక్తుడు శ్రీనివాసన్ రాఘవేంద్రస్వామి దర్శనార్థమై మంత్రాలయం వచ్చారని తెలిపారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకున్నారని చెప్పారు. అనంతరం శ్రీమఠం ఆధ్వర్యంలో జరుగుతున్న నిత్యాన్నదానానికి, శ్రీమఠం నిర్వహణలో ఉన్న గో సంరక్షణ శాలకు రూ.లక్ష చొప్పున రూ.2 లక్షలు అందజేసినట్లు పేర్కొన్నారు. ఆయనకు శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు మెమొంటో అందజేశారు.

వైసిపి వైఫల్యాలను వివరించేందుకే 'ఇదేం ఖర్మ'

- టిడిపి నాయకులు గజేంద్రారెడ్డి

ప్రజాశక్తి - నందవరం

కరపత్రాలు అందిస్తున్న టిడిపి నాయకులు గజేంద్రా రెడ్డి

మూడున్నర ఏళ్ల వైసిపి ప్రభుత్వంలో ప్రజలకు జరిగిన అన్యాయాలు, ప్రభుత్వ వైఫల్యాలను వివరించేందుకే 'ఇదేం ఖర్మ...మన రాష్ట్రానికి' నిర్వహిస్తున్నట్లు మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్, టిడిపి సీనియర్ నాయకులు గజేంద్రా రెడ్డి, తిప్పారెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని జొహరాపురం గ్రామంలో 'ఇదేం ఖర్మ' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నట్లు తెలిపారు. పరిపాలన చేతకాని ఒక అసమర్థ నాయకుని ఎన్నుకొని, ప్రజలు అనేక రకాలుగా కష్టాలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. సంజీవ రెడ్డి, నాగేష్, రమేష్, రంగప్ప, మేకల నాగన్న, నాగేంద్రప్ప, ఎర్ర నరసింహులు పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలోని 21వ వార్డులో 'ఇదేం ఖర్మ... మన రాష్ట్రానికి' నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డ్ కౌన్సిలర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దయాసాగర్ మాట్లాడారు. టిడిపితోనే అభివృద్ధి సాధ్యమని, వైసిపిని తిరస్కరించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. వార్డు అధ్యక్షులు హుస్సేన్ పీరా, పాల ఎల్లప్ప, గడ్డం రవి, హనుమంతమ్మ, సత్యమ్మ, రేష్మ, శ్రీరాజ్, వీరమ్మ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో ప్రచారం నిర్వహిస్తున్న దయాసాగర్

గ్రామస్తుల సహకారంతో ఉత్సవాలు విజయవంతం

- వైసిపి నాయకులు తోవి నర్సప్ప

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని తోవి గ్రామంలో మారికాంబ దేవి దేవర ఉత్సవాలు గ్రామస్తుల సహకారంతో పార్టీలకు అతీతంగా విజయవంతం చేసినట్లు వైసిపి నాయకులు తోవి నరసప్ప పేర్కొన్నారు. శనివారం పార్టీలకు అతీతంగా గ్రామ పెద్దలకు పూలమాలలు వేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో ప్రతి పండగనూ అందరూ కలిసిమెలిసి జరుపుకున్నప్పుడే ప్రజలు సంతోషంగా ఉంటారన్నారు. ప్రజల కోసం, గ్రామ అభివృద్ధి కోసం అందరూ కలిసి రావడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈరన్న, చంద్రశేఖర్ స్వామి, శంకర్, మల్లికార్జున్ రెడ్డి, జయరాం, పెద్ద నరసప్ప, నాగప్ప, సోమప్ప, ఎల్లప్ప, భీమయ్య, మారెప్పలను సన్మానించారు.

పెద్దలను సన్మానిస్తున్న నాయకులు

సీమకు జరుగుతున్న అన్యాయంపై

నోరు మెదపని ఎంపీ, ఎమ్మెల్యేలు

- ఆర్‌సిసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

రాయలసీమ ప్రాంత అభివృద్ధికి పాటుపడాల్సిన ఎంపీ, ఎమ్మెల్యేలు చట్టసభల్లో నోరు మెదపకపోవడం సిగ్గు చేటని రాయలసీమ కోఆర్డినేషన్ కమిటీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ రెడ్డి విమర్శించారు. సీమకు జరుగుతున్న అన్యాయంపై 'సీమ పిలుపు' కార్యక్రమ గోడపత్రికను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాయలసీమలో అత్యంత వెనుకబడిన కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతమైన ఆదోని డివిజన్ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సీమకు జరుగుతున్న అన్యాయంపై ఈనెల 22న ఆదోని రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో 'సీమ పిలుపు' బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేదవతి ఎత్తిపోతల పథకం ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తామని పాలకులు చెబుతున్నారని, కేవలం 3 టిఎంసిల సామర్థ్యం నిర్మాణంతో ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఎక్కువగా పత్తి సాగు అవుతున్న ఆదోని ప్రాంతంతో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసినా నిర్మాణానికి చర్యలు తీసుకోకుండా వేరే ప్రాంతానికి తరలించడం భావ్యం కాదన్నారు. పారిశ్రామిక రంగ అభివృద్ధికి ఆదోని అనుకూలంగా ఉన్నా పరిశ్రమలు స్థాపించకపోవడం వల్ల ఉపాధి కోసం యువత వలస వెళ్లాల్సిన దుస్థితి ఉందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధిపై పాలకులు చట్టసభల్లో నోరు విప్పాలని డిమాండ్ చేశారు. ఆర్‌సిసి రాష్ట్ర కార్యదర్శి రాజు, ఎఐఎఫ్‌టియు నాయకులు కరీం బాషా, రైతుకూలీ సంఘం నాయకులు నరసింహయ్య, ఆర్‌సిసి నాయకులు ప్రతాప్, రవి వర్మ, రాజ్ కుమార్, రామకృష్ణ, నల్లారెడ్డి, షేక్షావలీ, వీరభద్ర స్వామి, బసవ, విద్యార్థి సంఘం నాయకులు తిరుమలేష్, తేజ ఉన్నారు.

సీమ పిలుపు గోడపత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

వైఎస్ఆర్ బీమా పేదలకు వరం

- వైసిపి రాష్ట్ర యువజన నాయకులు ప్రదీప్ రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

ఆర్థిక సాయం అందజేస్తున్న ప్రదీప్‌రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైఎస్ఆర్ బీమా పథకం పేదలకు వరమని వైసిపి రాష్ట్ర యువజన విభాగపు నాయకులు వై.ప్రదీప్ రెడ్డి తెలిపారు. శనివారం కౌతాళంలోని 8వ వార్డు సభ్యులు ప్రమీలమ్మ భర్త పవన్ మృతి చెందారు. నామినీ అయిన ప్రమీలమ్మకు వైఎస్ఆర్ బీమా పథకం కింద రూ.10 వేలు, మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తరపున రూ.15 వేలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇంటి యజమాని మృతి చెందితే ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవడానికి ఈ పథకం దోహదపడుతుందని తెలిపారు. పేదల కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. ప్రమీలమ్మ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మాజీ జడ్‌పిటిసి దాట్ల కృష్ణంరాజు, సర్పంచి పాల్ దినకరన్, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, వైసిపి నాయకులు సుబ్బరాజు, రాఘవేంద్ర రెడ్డి, ఉరుకుంద ట్రస్టు బోర్డు సభ్యులు వెంకోబా, మాజీ సర్పంచి అవతారం, వడ్డే రాముడు, తిక్కయ్య, అబ్దుల్ సమద్, ఉమాపతి, రామకృష్ణ పాల్గొన్నారు.

పాదయాత్రకు సంఘీభావం తెలుపుదాం

- తెలుగు యువత అధికార ప్రతినిధి సర్పంచి కొండా పురుషోత్తం

ప్రజాశక్తి - చిప్పగిరి

మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ ఈనెల 19న రైతుల కోసం చేపడుతున్న పాదయాత్రకు రైతులందరూ సంఘీభావం తెలపాలని తెలుగు యువత అధికార ప్రతినిధి కొండా పురుషోత్తం కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వేదవతి పరిశీలన, సాధన కోసం హాలహర్వి నుంచి గూళ్యం వరకు కోట్ల సుజాతమ్మ పాదయాత్ర చేయనున్నట్లు తెలిపారు. చిప్పగిరి మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి సంఘీభావం తెలపాలని కోరారు.

వాతావరణ అనుకూల వ్యవసాయంపై పొలంబడి

ప్రజాశక్తి - హొళగుంద

విత్తనం వేస్తున్న సభ్యులు

రిలయన్స్ ఫౌండేషన్, ఆర్డిప్ సంస్థల ఆధ్వర్యంలో శనివారం శనగ పంటలో పొలంబడి నిర్వహించారు. రిలయన్స్ ఫౌండేషన్, ఆర్డిప్ సంస్థల ఆధ్వర్యంలో రబీ పంటగా శనగను వాతావరణ అనుకూల వ్యవసాయ పద్ధతుల ద్వారా పండించేందుకు హెబ్బటం గ్రామంలో రైతులకు కెవికె యాగంటి పల్లె వారు తయారు చేసిన నంద్యాల గ్రామ్ విత్తన రకాన్ని విత్తారు. ఆర్డిప్ సంస్థ నాగరాజు మాట్లాడుతూ... ఈ శనగ పంట విత్తు నాటి నుంచి పంట చేతికి వచ్చేంత వరకు కేవలం సుస్థిర వ్యవసాయ పద్ధతులను అనుసరించి పండిస్తున్నట్లు తెలిపారు. రక్షక పంటలుగా జొన్న వేసినట్లు చెప్పారు. రైతులు భీమేష్, లక్ష్మన్న పాల్గొన్నారు.